# ముల్లు దిగిన గులాబీ



బండారు లక్ష్మి

భరత్ కుమార్ మేడ మీద వరండాలో నిలబడి చూస్తున్నాడు. వాళ్ళమ్మ పేరు శకుంతలా కాదు, వాళ్ల నాన్న పేరు దుష్యంతుడూ కాదు. అయినా ఎందుకో ఆ కుర్రాడికి భరతుడి పేరు పెట్టారు, పేరు పెట్టిన రోజున వచ్చిన బహుమానాల్ని అందుకోడానికి నిర్మల చేతులు నొప్పి పుట్టాయట.

పెట్టిన పేరుతో పిలవడానికి తీరుబడి లేదు.

శర్మిలాకి నీట్‌నెస్ అంటే చాలా యిష్టం.

గార్డెన్ పెంచడానికి తోటమాలిని పెట్టినట్లుగానే— భరత్‌ని పెంచడానికి ఆయాని పెట్టింది.

తోటమాలి చేతిలో మొక్కలు— ఆయా చేతిలో భరత్ ఆరోగ్యంగానూ అందంగానూ పెరిగారు.

కాని కవులు ఎంత పోల్చి గీపెట్టినా పసిపిల్లలూ, సుమబాలలూ ఒకటి కారు. సుమబాలల్లో లేని సున్నితమయిన మనసు పసిపిల్లలలో ఉంటుంది. కాని అది శర్మిల లాంటి వారికి తెలియడమే కష్టం.

భరత్ అక్కడే నిలబడి ప్రక్కింటి పెరట్లోకి చూస్తున్నాడు. పెరట్లో బట్టలు ఆరేసుకోడానికి కట్టుకున్న త్రాడుని నెట్‌గా వుపయోగించుకొని రింగాడుకుంటున్నారు.

అమ్మవైపు వాళ్ళబ్బాయి శ్యాం ఉన్నాడు. నాన్న పార్టీలో ఎనిమిదేళ్ళ గీత వుంది.

వాళ్ళమ్మా నాన్నా కాసేపు ఆడి రింగు పిల్లలకిచ్చి— వాళ్ళిద్దరూ కొంచెం దూరంలో కుర్చీల్లో కూర్చున్నారు.

ప్రక్కనున్న గులాబీ చెట్టుకి రెండే రెండు పూలున్నాయి.

పిల్లలు ఆడుకుంటున్నారు.

అతను పువ్వును కోయబోతుంటే ఆవిడ వొద్దని అతని చెయ్యి పట్టుకుంది. అతనేమన్నాడో ఆమె పక పకా నవ్వుతోంది. నవ్వుతుంటే ఆవిడ బావుంది.

శ్యాం కెవ్వుమన్నాడు.

నవ్వు ఆపి ఇద్దరూ అటు చూసేరు.

గీత విసిరిన రింగు శ్యాం నుదుటికి తగిలింది. క్రిందపడ్డాడు. వాళ్ళమ్మ గబగబా వెళ్ళి శ్యాంని ఆ మట్టితోనే ఎత్తుకుంది. కుర్చీలో కూర్చుని ఒళ్లో కూర్చోబెట్టుకుంది. వాడితలను హృదయానికి హత్తుకుంది. చెంగుతో వాడి కళ్ళు తుడిచింది, నుదుటి మీద, బుగ మీద ముద్దు పెట్టుకుంది.

గీత వీపు మీద చెయ్యేసి 'హన్నా' అని వుత్తుత్తి దెబ్బలు కొట్టింది.

గీత కిలకిలా నవ్వింది.

శ్యాం వాళ్ళమ్మను గట్టిగా పట్టుకొని తలను ఆమె వెచ్చని గుండెలకు అదుముకున్నాడు.

నాన్న నవ్వుతూ "చాల్లేరా వెధవా" అన్నాడు ఉడుకుమోత్తనంగా

అమ్మ నవ్వింది.

బాబు సిగ్గుపడుతూ, చూసి ఆటకు పరిగెత్తేడు మళ్ళీ.

భరత్‌కు ఆ దృశ్యం ఎంతో నచ్చింది.

అదే మమ్మీ అయితే—

"ఆయా బాబుని తీసికెళ్ళి వాష్ చెయ్" అంటుంది.

మమ్మీ తననెప్పుడూ అలా ఎత్తుకుని ముద్దు పెట్టనే పెట్టదు. మమ్మీకసలు తీరుబడే వుండదు.

తను కొంచెం ఏడిస్తేచాలు "ఆయా" అంటుంది గట్టిగా. అంతే ఆయా వచ్చి ఎత్తుకొని తీసుకుపోయి—

"చాక్‌లెట్ తింటావా— బిస్కట్ తింటావా" అంటుది తనేదో తిండికి మొహం వాసి ఉన్నట్టు.

వాడికి బొమ్మలు కొనడం తప్ప యింకేమీ రాదు,

ఎదురుగా ఉంటే "హా ఆర్యూ" అంటారు చుట్టంలా.

పెరట్లోకి చూసేరు భరత్.

శ్యాం వాళ్ళ నాన్న గారి వీపు మీద ఎక్కాడు.

ఆయన విచిత్రంగా గుర్రంలా శబ్దం చేస్తూ శ్యాంని లోపలికి తీసుకుపోయారు.

వాళ్ళమ్మ, గీత వెనకాల వెళ్ళిపోయారు.

"ఆయా" విసుగ్గా పిలిచాడు భరత్.

అతని గొంతులో విసుగుకి భయపడి ఆయా పరిగెత్తుకొచ్చింది.

"మమ్మీ ఎప్పుడొస్తుంది?" అడిగాడు భరత్.

"యింకో అరగంటలో వచ్చేస్తారు బాబూ— మళ్ళీ ఎనిమిది గంటలకు పార్టీ వుంది"

"ఛీ" చేతికందుబాటులో వున్న కుక్క బొమ్మని నేలకేసి కొట్టాడు.

ఆ "ఛీ"లో ఎంత అసంతృప్తి— ఆవేదనా ఉన్నాయో ఆయాకి తెలుసు.

కాని ఏం చేయగలదు!

మమ్మీ వచ్చేటప్పటికి భోజనం చేసి రెడీగా వుండు బాబూ, నిన్ను చక్కగా కూర్చోబెట్టుకొని కబుర్లు చెప్తారు" అంది ఆయా.

భరత్‌కి కొంచెం కోపం తగ్గింది.

పిల్లి తగువు పిల్లి తగువు కోతి తీర్చిన

జున్ను ముక్క కథ చెప్తూ భరత్‌ని భోజనం చేయించింది ఆయా.

ఆయాకు ఆ పిల్లాడంటే ఎంతో జాలి.

తల్లీ తండ్రీ– కావలసినంత డబ్బూ- నౌకర్లూ- కార్లూ– ఉండి కూడా తల్లి ప్రేమ కోసం మొహం వాసిపోతున్న ఆ నిరుపేదను చూస్తుంటే ఆమె హృదయం కరిగి నీరవుతుంటుంది.

తండ్రికి ఎన్నో వ్యాపారాలు- వ్యాపకాలు- క్షణం తీరికలేని పని. తల్లి ఉదయం ఎనిమిది గంటలకు డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుని "ఆర్యూ రెడీ భరత్" అంటుంది.

టిఫిన్ తిన్నాక బుగ్గ మీద ముద్దు పెట్టించుకుంటుంది, అంతే.

"ఆయా బాబుని తీసికెళ్ళు డ్రైమై పోయింది" అంటుంది.

భరత్‌కు అమ్మఒడిలో కూర్చోవాలనీ- బడిలో జరిగిన విశేషాలు చెప్పాలనీ- మాస్టారి మంచితనాన్ని పొగడాలని– తనని ఎందుకు గుడ్ అన్నారో వివరించాలని- ఎంతో ఉత్సాహంగా యింటికి వస్తాడు. కానీ ఇంటి దగ్గర ఆయా వాళ్ల తప్ప ఎవరూ వుండరు. ప్రాణంవుసూరుమంటుంది.

మమ్మీ, డాడీ వచ్చేటప్పటికి ఏడయింది.

శర్మిలకు పార్టీకి ఏ చీర కట్టుకోవాలో తేలడంలేదు. గాబరా పడిపోతోంది.

అరిటాకు పచ్చరంగు చీర కట్టుకుందామనుకుంది. కాని మేచింగ్ వుంగరంలో రాయి పడిపోయింది.

బీరువాలోంచి ఓ పాతిక చీరలు తీసి మంచంమీద పడేసింది. మిసెస్ బర్నాలా వాళ్ళ తమ్ముడు ఫారిన్ నుంచి తెచ్చిన పాలపిట్ట రంగు చీర కట్టుకొస్తుంది. ఫారిన్ బ్రా- ఫిగరంతా చక్కగా కనిపిస్తుంది. అందరికళ్లూ ఆవిడ మీదే వుంటాయి.

తను పట్టు చీర కట్టుకెళ్తే అమ్మమ్మలా వుంటుంది.

"మమ్మీ నన్నెత్తుకోవా". భరత్ మమ్మీ నడుం చుట్టూ చేతులు వేసి గట్టిగా పట్టుకున్నాడు.

మమ్మీ ఒక్కసారి చిరాగ్గా భరత్ వైపు చూసి "నువ్వింకా పడుకోలేదా! ఆయా" గట్టిగా అరిచింది శర్మిల.

ఆవిడ ఒంటి మీద పామును చూసినట్టు భరత్ చటుక్కున చేతుల్ని వెనక్కి తీసుకున్నాడు.

"ఆయా ఒద్దులే. నేను పడుకుంటాను" భరత్ మమ్మీ మొకం వైపు చూడకుండా వెళ్ళిపోయాడు.

మమ్మీ భరత్ మాటలకు ఒకసారి విస్తుపోబోయింది.

కానీ అంతట్లోనే డాడీవచ్చి

"నీ చీర సెలెక్షన్ ఇంకా అవలేదా- హొయ్‌రాం" అంటూ హడావిడి చేసేశు.

ఆ సందట్లో భరత్ మాట అడుగున పడిపోయింది.

కారు వెళ్ళిపోయిన శబ్దం వినిపించినంతవరకు- భరత్‌కి నిద్రపట్టలేదు. ఇంకా చాలాసేపు నిద్రపట్టలేదు.

నిద్ర పట్టలేదని తెలుస్తే ఆయా కథ చెప్తానంటుంది.

ఆయా చూపించే జాలి అతనికి ముల్లులా గుచ్చుకుంటుంది.

పాపం ఆయా చాలా మంచిది

భరత్ ఉదయం స్కూలుకి వెళ్ళేటప్పటికి మమ్మీ లేవలేదు. సాయంత్రం స్కూలు నుంచి వచ్చేటప్పటికి- మమ్మీ ఇంట్లో లేదు. ఆయా డాడీ పంపించిన పోలీసు బొమ్మను భరత్‌కు అందించింది. ఒక పావుగంటకే విసుగొచ్చి అక్కడే పడేసేడు.

ప్రక్కింట్లో పిల్లలు ఆడుకుంటున్నారు.

పెంకు ముక్కలు ఒకదాని మీద ఒకటి దొంతరగా పెట్టి చూస్తూ గిరి గీసింది వాళ్ళమ్మ.

చెరోవైపూ దూరంగా నిలబడి శ్యాం, గీతా బంతితో పెంకుల్ని కొడుతున్నారు.

ఎవరి బంతి పెంకులకు తగిలితే వాళ్లు చప్పట్లుకొట్టి కేరింతలు కొడుతున్నారు.

"ఆయా మనం వాళ్ళింటి కెళ్దామా కాసేపు" ఎంతో ఉత్సాహంగా అడిగాడు భరత్. వాళ్ళ ఆట చాలాకు ఉత్సాహం అతని కళ్ళల్లో ప్రతిఫలిస్తుంది.

బాబు ముఖంలోని రిక్వెస్టుకి చలించిపోయి నిస్సహాయంగా నిలబడింది ఆయా

క్రింద అంతస్థు వాళ్ళతో తిరగడం అమ్మగారికి ఇష్టం వుండదు. ఆవిడకు యిష్టంలేని పని చేస్తే- యింకేం మాట్లాడకుండా, నెల జీతం అంతా చేతిలో పెట్టి వెళ్ళిపో అంటుంది.

శ్యాం, గీత గట్టిగా నవ్వుతున్నారు.

వాళ్ళ నాన్న వచ్చేరు. ఏదో తింటూ అల్లరి చేస్తున్నారు. నాన్న చుట్టూ చేరి కేరింతలు కొడుతున్నారు.

వాళ్ళెంత ఆనందంగా వున్నారు.

డాడీకి డబ్బు పిచ్చి. అంతా తనకేనట. ఆయా చెప్పింది. తనకెందుకు అంత డబ్బు? తను సంపాదించుకోలేడా- హాయిగా వుద్యోగం చేసుకోలేడా- క్షణం కూడా తీరిక లేకుండా వీళ్ళకి సంపాదన ఏందుకు?

తను లేకపోతే వీళ్ళు ఎవరి కోసం సంపాదిస్తారు?

తను చచ్చిపోతే–?

చచ్చిపోయాడని ఫోన్ చేస్తే మమ్మీ పార్టీ లోంచి రాదు.

"ఇంటికెవరొచ్చి ఏం చేస్తారు ఏర్పాట్లు కానివ్వండి వస్తాను" అంటుంది.

భరత్‌కి ఏడుపు రాలేదు ఏడుపు లాంటి నవ్వొచ్చింది.

గాజు కళ్ళలాగ మొహం కళావిహీనం అయిపోయింది.

"నిద్ర రావటం లేదా బాబూ" అడిగింది ఆయా.

"లేదు ఆయమ్మా" అతని గొంతు వేదనగా వుంది.

"ఈ మాత్రేసుకొని పడుకో బాబ్జీ" నల్లటి గోళీ యిచ్చింది ఆయా.

భరత్ పడుకున్నాడు. మృత్యువు లాంటి నిద్ర. తల్లి పక్కన వెచ్చగా నిండుగుండెతో పడుకోవలసిన భరత్.

కాబోయే లక్షలకధికారి- ప్రేమకు నోచుకోలేని బికారి- నల్లమందు మింగి చొంగ కారుస్తూ నిద్రలోకి జారిపోయాడు.

